క్లుప్తంగా

పోషకాహారంపై అవగాహన

ముసునూరు: చిన్నారులు, గర్భిణులు, బాలింతలు అంగన్‌వాడీల ద్వారా అందుతున్న పోషకాహారంతోనే రక్తహీనత తగ్గుతుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాజ్యలక్ష్మి పిలుపునిచ్చారు. మంగళవారం పోషణ మహోత్సవాల సందర్భంగా ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీలు, సదస్సులు నిర్వహించారు. బాలామృతంతో రకరకాల పోషకాహార పిండి వంటలు తయారు చేసుకునే విధానాన్ని ప్రదర్శించారు. ఆరోగ్యకరమైన ఆహారాన్ని స్వీకరిస్తూ మానసిక ఆనందంతో జీవించాలన్నారు. అంగన్‌వాడీలు, ఆశాలు పాల్గొన్నారు.

బీమా చెక్కు అందజేత



ఇబ్రహీంపట్నం: విద్యుత్ శాఖలో లైన్‌మెన్‌గా పనిచేస్తూ గత ఏడాది ఆగస్టులో వచ్చిన వరదల్లో ప్రమాదవశాత్తు మృతిచెందిన వజ్రాల కోటేశ్వరరావు కుటుంబానికి యాక్సిస్ బ్యాంకు అధికారులు బీమా నిమిత్తం రూ.28 లక్షలు మంజూరు చేశారు. స్థానిక డివిజనల్ కార్యాలయంలో మృతుడి భార్య వజ్రాల మాధవీలతకు బ్యాంకు మేనేజర్ ఎండీ మునీర్, డివిజన్ ఈఈ వసంతరావు బీమా చెక్కును మంగళవారం అందజేశారు. వారు మాట్లాడుతూ తమ బ్యాంకులో మృతునికి వేతనం ఖాతా ఉండటంతో బీమా వర్తించిందన్నారు. తాను చనిపోవడంతో ఆ కుటుంబానికి రూ.28 లక్షలు బీమా రూపంలో అందజేశామని చెప్పారు. విద్యుత్ శాఖ ఉద్యోగులు పాల్గొన్నారు.

ఘనంగా రథోత్సవం

చాట్రాయి: శ్రీరామ నవమి సందర్భంగా చనుబండ కోదండ రామాలయంలో సోమవారం రాత్రి రథోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మహా అన్నదానం నిర్వహించారు. నూజివీడు సీఐ కె.రామకృష్ణ ఆధ్వర్యంలో ఎస్ఐ డి.రామకృష్ణ బందోబస్తు నిర్వహించారు. రంగురంగుల విద్యుత్ దీపాలతో అలంకరించిన రథంపై రాత్రి 11 గంటలకు స్వామి వార్లను ఊరేగించారు. వర్షాన్ని లెక్క చేయకుండా చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు పాల్గొన్నారు.

సీతారాముల పవళింపు సేవ



తిరువూరు: స్థానిక జగన్నాథపురం కాలనీలోని దాసాంజనేయస్వామి ఆలయంలో శ్రీరామ నవమి ఉత్సవాల ముగింపు సందర్భంగా మంగళవారం రాత్రి స్వామి వారి పవళింపు సేవ సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు పార్థసారథాచార్యులు, ఆస్థానాచార్యులు విఠలాచార్యులు ఆధ్వర్యంలో సీతారాములకు విశేష పూజలు చేశారు. పవళింపు సేవలో భాగంగా దంపతుల తాంబూల కార్యక్రమాన్ని జరిపారు.

ముగిసిన నవమి ఉత్సవాలు

తిరువూరు: శ్రీరామ నవమి ఉత్సవాల ముగింపు సందర్భంగా గంపలగూడెం సీతారామచంద్రస్వామి దేవస్థానంలో స్వామివారికి మంగళవారం విశేష పూజలు నిర్వహించారు. సీతారాముల ఉత్సవ విగ్రహాలను ప్రత్యేక రథంలో ఉంచి గ్రామోత్సవం జరిపారు. ఆలయ అర్చకులు దేవయాజనం శ్రీధరాచార్యులు, రామాచార్యులు ఆధ్వర్యంలో చూర్ణోత్సవం, వసంతోత్సవం, శ్రీచక్ర స్నానం శాస్త్రోక్తంగా జరిపారు.

అన్యమత కట్టడాలకు అనుమతి వద్దని వినతి

తిరువూరు: గంపలగూడెం మండలం మేడూరులోని వీరాంజనేయ స్వామి దేవస్థాన ప్రాంగణంలో అన్యమత ప్రచారం, అన్యమత కట్టడాల నిర్మాణాన్ని అడ్డుకోవాలని భక్తులు మంగళవారం తహసీల్దారు, ఎస్ఐకి వినతిపత్రాలు సమర్పించారు. ఆలయ పవిత్రతను కాపాడాలని, మేడూరు కొండపై ఇతర మతస్తులు నిర్మాణాలు జరపడానికి యత్నిస్తున్నందున అధికారులు తగు చర్యలు తీసుకోవాలని కోరారు. ఆలయ చైర్మన్ ముత్యాల వెంకటేశ్వరరావు, భక్తబృంద సభ్యులు కాజా రవికుమార్, కొత్తగుండ్ల నరసింహారావు, వనమా సుజాత, మీసాల సత్యనారాయణ, విశ్వ హిందూ పరిషత్ ప్రతినిధులు శ్రీనివాసరావు, దేవిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, ముదిగొండ దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పాస్టర్లకు భద్రత కల్పించాలి

జి.కొండూరు: క్రైస్తవులకు, పాస్టర్లకు రాష్ట్ర ప్రభుత్వం భద్రత కల్పించాలని జి. కొండూరు మండల క్రైస్తవుల ఐక్య వేదిక కమిటీ సభ్యులు అన్నారు. స్థానిక ఇండియా పెంతుకోస్తు చర్చిలో దివంగత పాస్టర్ ప్రవీణ్ పగడాల ఆదరణ కూడికను మంగళవారం సాయంత్రం నిర్వహించారు. పాస్టర్లు మాట్లాడుతూ సమాజంలో పాస్టర్లకు, క్రైస్తవులకు సరైన భద్రత లేదన్నారు. పాస్టర్ ప్రవీణ్ ప్రగడాల మృతిపై సమగ్ర దర్యాప్తు చేట్టాలని డిమాండ్ చేశారు. పాస్టర్లు పాల్గొన్నారు.

మామిడి తోటల పరిశీలన

మైలవరం: గత రాత్రి ఈదురు గాలులకు మామిడి పంట పూర్తిగా ధ్వంసమవడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు సీహెచ్ కోటేశ్వరరావు అన్నారు. మైలవరం, జి.కొండూరు మండలాల్లో దెబ్బతిన్న పంటను మంగళవారం ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ గత మూడేళ్లుగా నల్లి, కోడిపేను, తామర వంటి తెగుళ్లతో మామిడి రైతులు తీవ్రంగా నష్టపోయారని చెప్పారు. ప్రభుత్వమే రైతులను ఆదుకోవాలని కోరారు.

అపార నష్టం



జి.కొండూరులో నేలవాలిన మొక్కజొన్నను చూపుతున్న రైతులు



ఇబ్రహీంపట్నం మండలం కొండపల్లి శివారులో వర్షానికి తడిసిన ధాన్యం

అకాల వర్షం రైతులకు విషాదాన్ని మిగిల్చింది. మైలవరం, తిరువూరు నియోజకవర్గాల్లో సోమవారం సాయంత్రం పెనుగాలులతో కూడిన వర్షం కురిసింది. గాలులకు మామిడి కాయలు నేల రాలాయి. వరి, మొక్కజొన్న పైరు నేలకొరిగింది. కల్లాల్లో ఉన్న ధాన్యం, మొక్కజొన్నలు తడిసిపోయాయి. నోటికాడికి వచ్చిన పంట వర్షార్పణం కావడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. నష్ట పరిహారం అంచనా వేసి ప్రభుత్వం ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు. – జి.కొండూరు/తిరువూరు



కుప్ప పోసిన నేలరాలిన మామిడి కాయలు



జి.కొండూరులో నేలరాలిన మామిడి కాయలు

కార్యకర్తలకు వైఎస్సార్ సీపీ అండ

నూజివీడు మాజీ ఎమ్మెల్యే ప్రతాప్ అప్పారావు



శ్రీనివాసరావు కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ప్రతాప్ అప్పారావు

ముసునూరు: వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తల కుటుంబాలకు పార్టీ కొండంత అండగా ఉంటుందని నూజివీడు మాజీ ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు అన్నారు. ముసునూరు వ్యవసాయ సొసైటీ మాజీ అధ్యక్షుడు, పార్టీ యువనేత మానికల శ్రీనివాసరావు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. సోమవారం రాత్రి గ్రామ పార్టీ అధ్యక్షుడు తులిమెల్లి సుబ్బారావు ఆధ్వర్యంలో పార్టీ నేతలు పలువురితో కలిసి దివంగత మానికల శ్రీనివాసరావు ఇంటికి ప్రతాప్ అప్పారావు చేరుకున్నారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులతో మాట్లాడి ధైర్యం చెప్పారు. కృష్ణా జెడ్పీ వైస్ చైర్మన్ గుడిమెల్లి కృష్ణంరాజు, మాజీ సర్పంచ్ రేగుల గోపాలకృష్ణ, సీనియర్ నేతలు మానికల పంగిడయ్య, గండిపూడి రామారావు, ఒరుగు రంగారావు, చెన్ను సత్యం, మండల పార్టీ యూత్ అధ్యక్ష, కార్యదర్శులు గూట్రు రంగారావు, మానికల గంగాధర్, సభ్యులు పాల్గొన్నారు.

కొటికలపూడిలో ముగిసిన గ్రామోత్సవం



దీప స్తంభం, దైవాలతో గ్రామోత్సవం నిర్వహిస్తున్న భక్తులు

కొటికలపూడి(ఇబ్రహీంపట్నం): శ్రీరామ నవమిని పురస్కరించుకుని సీతారామ కల్యాణం సందర్భంగా కొటికలపూడి గ్రామంలో మూడు రోజులుగా భక్తిశ్రద్ధలతో నిర్వహించిన గ్రామోత్సవం మంగళవారంతో ముగిసింది. శ్రీరామ నవమి పండుగరోజు స్వామివార్ల కల్యాణం అనంతరం స్వామివారి దీప స్తంభం, నరసింహస్వామి, చెన్నకేశవ స్వామి దైవాలతో పాటు వారి కోపాలను హరించే శాంతి స్వామి దైవాలను భక్తులు మోస్తూ వీధుల్లో ఊరేగించారు. ఇంటింటికీ దైవాలు, దీప స్తంభం చేరడంతో భక్తులు నీళ్ల వారబోసి కొబ్బరి కాయలు కొట్టారు. నూతన వస్త్రాలు, కానుకలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ ఏడాది పాడిపంటలతో గ్రామం సుభిక్షంగా ఉండాలని కోరుకున్నారు.

కార్పొరేషన్ల రుణాలకు ఇంటర్వ్యూలు



మైలవరంలో ఇంటర్వ్యూ నిర్వహిస్తున్న అధికారులు



నూజివీడులో ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న బ్యాంకర్లు

మైలవరం: మండలంలోని బీసీ కులాలు, ఆర్యవైశ్య, బ్రాహ్మణ, కమ్మ, కాపు, రెడ్డి, శాలివాహన, మేదర కార్పొరేషన్ల ద్వారా రుణాల మంజూరుకు 992 మంది దరఖాస్తు చేసుకున్నారని ఎంపీడీఓ అనూరాధ తెలిపారు. దరఖాస్తు దారులకు మంగళవారం ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో ఇంటర్వ్యూలు జరిగాయని, 489 మంది హాజరు కాగా వారికి వివిధ బ్యాంకుల శాఖల మేనేజర్లు ఇంటర్వ్యూలు నిర్వహించారని వివరించారు.

నూజివీడు: పట్టణానికి మంజూరైన బీసీ, ఓసీ కార్పొరేషన్ యూనిట్లకు మంజూరైన రుణాల దరఖాస్తుదారులకు మున్సిపల్ కార్యాలయం వద్ద మంగళవారం బ్యాంకర్లు ఇంటర్వ్యూలు నిర్వహించారు. పట్టణానికి బీసీ, ఓసీలకు సంబంధించి 103 యూనిట్లు మంజూరు కాగా వాటికి దాదాపు 1,200 దరఖాస్తులు వచ్చాయి. వీరందరికి ఉదయం 10 గంటల నుంచి బ్యాంకర్లు, అధికారులు కలిసి ఇంటర్వ్యూలు నిర్వహించారు. కార్యక్రమాన్ని మున్సిపల్ కమిషనర్ ఆర్.వెంకటరామిరెడ్డి పర్యవేక్షించారు.

- తిరువూరు: గంపలగూడెం మండలంలో వివిధ కార్పొరేషన్ల ద్వారా స్వయం ఉపాధి రుణాలకు దరఖాస్తు చేసుకున్న వారికి మంగళవారం ఇంటర్వ్యూలు నిర్వహించారు. స్థానిక ఇందిరా క్రాంతి పథకం కార్యాలయంలో అభ్యర్థులకు ఎస్‌బీఐ, సప్తగిరి, యూనియన్ బ్యాంకుల అధికారులు, ఎంపీడీఓ నాగేశ్వరరావు ఇంటర్వ్యూ చేశారు. 1,047 మంది ఈ రుణాల కోసం దరఖాస్తు చేయగా, 946 మంది ఇంటర్వ్యూలకు హాజరయ్యారని ఎంపీడీఓ చెప్పారు.
- ఇబ్రహీంపట్నం: బీసీ, ఓసీ కార్పొరేషన్‌ల రుణాల మంజూరుకు మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఇంటర్యూవ్‌లు నిర్వహించామని ఎంపీడీఓ సునీతశర్మ తెలిపారు. వివిధ గ్రామాలకు చెందిన 11 బ్యాంకుల ప్రతినిధులు హాజరై లబ్ధిదారుల అర్జీలు పరిశీలించారు. మొత్తం 596 మంది దరఖాస్తుకోగా 425 మంది ఇంటర్యూవ్‌కు హాజరయ్యారని చెప్పారు. కొండపల్లి మున్సిపాల్టీలో నిర్వహించిన ఇంటర్యూవ్‌లకు 360మంది అర్జీదారులకు గాను 343 మంది హాజరయ్యారని కమిషనర్ రమ్యకీర్తన తెలిపారు.

మామిడి, మొక్కజొన్న రైతులను ఆదుకోవాలి



రెడ్డిగూడెం మండలంలో మామిడి తోటలను పరిశీలిస్తున్న నాయకులు

మైలవరం: సోమవారం రాత్రి వీచిన ఈదురు గాలులు, అకాల వర్షానికి మామిడి రైతులు, మొక్కజొన్న రైతులు తీవ్రంగా నష్టపోయారని, నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని వైఎస్సార్ సీపీ మైలవరం రైతు విభాగం, పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. మైలవరంలోని పార్టీ కార్యాలయంలో వైఎస్సార్ సీపీ రైతు విభాగం నాయకులు మాట్లాడుతూ తీవ్రమైన గాలి, వర్షం కారణంగా మైలవరం, జి.కొండూరు, రెడ్డిగూడెం, చాట్రాయి, గంపలగూడెం, నూజివీడు, తిరువూరు, విస్సన్నపేట, ఎ.కొండూరు మండలాల్లో మామిడి, వరి, మొక్కజొన్న పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయని, దీనితో రైతులు పూర్తిగా నష్టపోయారన్నారు. రాజకీయాలకు అతీతంగా రైతులను ఆదుకోవాలని కోరారు. పంట నష్టాన్ని పార్టీ నాయకులు పరిశీలించారు. వైఎస్సార్ సీపీ రైతు విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు ఉయ్యూరు సత్యనారాయణరెడ్డి, మండల పార్టీ నాయకులు కత్తుల వెంకటరెడ్డి, చాట్ల రాబర్ట్, కుప్పిరెడ్డి వరప్రసాద రెడ్డి, గుడిసె ప్రభాకరరెడ్డి, కలకొండ రామారావు తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్ల పరిశీలన



రైతులతో మాట్లాడుతున్న వసంత కృష్ణప్రసాద్

భవానీపురం(విజయవాడపశ్చిమ): గొల్లపూడిలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ యార్డ్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ మంగళవారం మధ్యాహ్నం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన రైతులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, కమిషనర్, విజయవాడ సబ్ కలెక్టర్ కావూరి చైతన్య, సంబంధిత అధికారులతో రైతుల సమస్యలపై మాట్లాడారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ వాతావరణ ప్రతికూల పరిస్థితుల నేపథ్యంలో మరో నాలుగు రోజులపాటు అకాల వర్షాలు ఉన్నందున సాధ్యమైనంత త్వరగా ధాన్యాన్ని కొనుగోలు చేయాలన్నారు. ప్రైవేట్ లారీలను కూడా తీసుకువచ్చి ధాన్యాన్ని మిల్లర్ల వద్దకు చేరుస్తున్నామని పేర్కొన్నారు. రైతులు ఆందోళన చెందాల్సిన పని లేదని ధైర్యం చెప్పారు.

వేసవిలో జాగ్రత్తలు తప్పనిసరి

ముసునూరు: ఉపాధి హామీ కూలీలు వేసవిలో తప్పనిసరిగా జాగ్రత్తలు పాటించాలని ఏపీఓ టి.రోజీలీల సూచించారు. మంగళవారం ఆమె చెక్కపల్లి, రమణక్కపేట గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి హామీ పనుల్లో నీటి గుంతలు, పంట కాలువలు, పశువుల నీటి తొట్టెలను పరిశీలించి, ఉపాధి మేట్లు, కూలీల హాజరును తనిఖీ చేశారు. వేసవి ఎండల్లో పని చేస్తున్న కూలీలకు మంచినీరు, నీడ వసతి కల్పించాలని సిబ్బందిని ఆదేశించారు. అనంతరం వేసవిలో పని ప్రదేశాల్లో తీసుకోవలసిన జాగ్రత్తలను సిబ్బందికి, మేట్లకు వివరించారు. కార్యక్రమాల్లో ఉపాధి హామీ మేట్లు, కూలీలు పాల్గొన్నారు.

మే 20న ఆశా వర్కర్ల సమ్మెను జయప్రదం చేయండి

మైలవరం: ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మే 20వ తేదీన నిర్వహించే సమ్మెను జయప్రదం చేయాలని ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి ఎ. కమల మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పేద ప్రజలకు కోవిడ్ సమయంలో ఫ్రంట్ లైన్ వారియర్స్‌గా పనిచేసి ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రశంసలు అందుకున్న ఆశా వర్కర్లకు వేతనాలు పెంచకపోవడం దురదృష్టకరమన్నారు. ఎన్‌హెచ్ఎం నిధులు పెంచాలని, పీఎఫ్, ఈఎస్ఐ, పెన్షన్ వంటి సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు.

ఆశీల వసూలు రద్దు చేయాలి

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): దుకాణదారులు, చిరు వ్యాపారులకు భారంగా మారిన ఆశీల వసూలు రద్దు చేయాలని వైఎస్సార్ సీపీ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి ఉయ్యూరు శ్రీనివాసరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. గత వైఎస్సార్ సీపీలో చట్టప్రకారం ప్రకారం ఆశీలు వసూలు చేస్తే అడ్డుకున్న టీడీపీ నాయకులు ఇప్పుడు ఆశీలు వసూలు చేయడం ఏమిటని ప్రశ్నించారు. ఆశీల వసూలుపై మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు అప్పుడు నానారాద్ధాంతం చేసి ఇప్పుడు టీడీపీ వసూలు చేస్తుంటే మిన్నకుండి పోయారని ఎద్దేవా చేశారు.

పెంచిన గ్యాస్ ధరలు తగ్గించాలని ధర్నా



ధర్నా చేస్తున్న సీపీఐ నాయకులు, కార్యకర్తలు



నిరసన కార్యక్రమంలో పాల్గొన్న సీపీఎం నాయకులు, కార్యకర్తలు

నూజివీడు: కేంద్ర ప్రభుత్వం గ్యాస్ సిలిండర్‌పై పెంచిన రూ.50 తక్షణమే తగ్గించాలని, పెట్రోల్, డీజిల్‌పై ఎక్సైజ్ డ్యూటీని రూ.2 పెంచడాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని సీపీఐ పట్టణ కార్యదర్శి చాట్ల పుల్లారావు డిమాండ్ చేశారు. పెంచిన వంట గ్యాస్ ధరను తగ్గించాలని డిమాండ్ చేస్తూ సీపీఐ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో పట్టణంలోని పెద్ద గాంధీ బొమ్మ సెంటర్‌లో సీపీఐ ఆధ్వర్యంలో మంగళవారం ధర్నా నిర్వహించారు. పుల్లారావు మాట్లాడుతూ పెంచిన గ్యాస్ ధరను తగ్గించే వరకు ప్రజా సంఘాలతో కలిసి సీపీఐ నేతృత్వంలో ఆందోళనలను కొనసాగిస్తామని హెచ్చరించారు. 2014లో అధికారంలోకి వచ్చిన నాటి నుంచి కేంద్ర ప్రభుత్వం ధరలను అనేక రెట్లు పెంచి ప్రజలపై మోయలేని భారాలు మోపుతోందని ధ్వజమెత్తారు. చివరకు ఉజ్వల పథకం వంట గ్యాస్ సిలిండర్ల ధరలను కూడా పెంచడం దారుణమన్నారు. పెట్రోలు, డీజిల్ ధరల పెంపు వల్ల నిత్యావసర వస్తువుల ధరలు పెరిగి, ప్రజలపై పెనుభారం పడుతుందన్నారు. సీపీఐ పట్టణ నాయకులు పల్లే ప్రేమ్ కుమార్, పి. ప్రవీణ్, ఒగ్గు ముఖర్జీ, ఏఐటీయూసీ నాయకులు కోలా రామ్మూర్తి, బోను చంద్రరావు, టి.సన్యాసినాయుడు, పోలి అప్పలనాయుడు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

నూజివీడు: కేంద్ర ప్రభుత్వం వంటగ్యాస్ ధరలను సిలిండర్‌కు రూ.50 పెంచడంతో పాటు పెట్రోలు, డీజిల్‌పై ఎక్సైజ్ డ్యూటీని పెంచడాన్ని వ్యతిరేకిస్తూ సీపీఎం ఆధ్వర్యంలో పట్టణంలో మంగళవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జి.రాజు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం వంట గ్యాస్ ధరను పెంచి ప్రజల నెత్తిన భారాన్ని మోపిందని ధ్వజమెత్తారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే పెంచిన ధరలను తగ్గించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు శోభనాద్రి తదితరులు పాల్గొన్నారు.

బెల్ట్ షాపులపై సీపీఎం ఆందోళన

మైలవరం: మైలవరం మండలంలో 200లకు పైగా బెల్ట్‌షాపులు నిర్వహిస్తున్నారని, వీటిని అరికట్టాలని, లేకుంటే ఆందోళన నిర్వహిస్తామని సీపీఎం మైలవరం మండల కార్యదర్శి సీహెచ్ సుధాకర్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండలంలో తాగడానికి మంచినీళ్లు దొరకడం కష్టమే మోకానీ మద్యం మాత్రం బెల్ట్ షాపుల ద్వారా ఏరులై పారుతోందన్నారు. అధికార పార్టీ నాయకుడి కనుసన్నల్లో గ్రామ గ్రామానికి ఆటోల ద్వారా మద్యం సరఫరా చేస్తున్నారని ఆరోపించారు. ఒక్క గణపవరం గ్రామంలోనే పదుల సంఖ్యలో బెల్ట్ షాపులు దర్శనమిస్తున్నాయని చెప్పారు. గణపవరం గ్రామంలో రోడ్ల పరిస్థితి దారుణంగా ఉన్నా పట్టించుకునే నాథుడు లేడని, బెల్టు షాపులు మాత్రం వీధి వీధికి ఏర్పాటు చేశారని ధ్వజమెత్తారు. దీనిపై ప్రభుత్వం, అధికారులు స్పందించాలని కోరారు.

14 మంది పాత నేరస్తుల బైండోవర్

నూజివీడు: స్థానిక ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని నూజివీడు మండలం పోలసానపల్లికి చెందిన 14 మంది పాత నేరస్తులను ఎక్సైజ్ సీఐ ఎ.మస్తానయ్య మంగళవారం తహసీల్దార్ బీవీ సుబ్బారావు ఎదుట బైండోవర్ చేశారు. బైండోవర్ అయిన వారిలో నారగాని వెంకటేశ్వరరావు, అచ్చి రాంబాబు, నారగాని ఏడుకొండలు, నారగాని శివరామకృష్ణ, నారగాని వరప్రసాద్, నారగాని మురళి, నారగాని సురేష్, నారగాని రమేష్, పలగాని సత్యనారాయణ, నారగాని శివశంకర్‌రావు, నారగాని రంగారావు, పామర్తి సాంబశివరావు, ముక్కు రవికిరణ్, నీలపు శివకుమారి ఉన్నారు. తహసీల్దార్ మాట్లాడుతూ వీరందరిని ఏడాది పాటు బైండోవర్ చేశామని, ఈ కాలంలో ఎక్సైజ్ నేరాలకు పాల్పడితే లక్ష రూపాయల జరిమానా విధించడంతో పాటు ప్రభుత్వ పథకాలు వర్తించకుండా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

రీసర్వే సక్రమంగా నిర్వహించాలి

తహసీల్దార్ రాజ్‌కుమార్



తాళ్లవల్లిలో రీ సర్వేను పరిశీలిస్తున్న తహసీల్దార్

ముసునూరు: భూ సమస్యల శాశ్వత పరిష్కారానికి రీ సర్వేను సక్రమంగా నిర్వహించాలని తహసీల్దార్ కె.రాజ్‌కుమార్ సర్వే సిబ్బందిని ఆదేశించారు. మండలంలోని కొర్లగుంట శివారు తాళ్లవల్లిలో రీసర్వే పనులను మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. భూముల సమస్యలు పునరావృతం కాకుండా శాశ్వత పరిష్కార మార్గాలను చూపే విధంగా సర్వే నిర్వహిస్తున్నామని చెప్పారు. గ్రామంలో మొత్తం సరిహద్దు నిర్దేశకాలు 83 కాగా, 10 పూర్తి చేశామన్నారు. కార్యక్రమాల్లో డీటీ పురుషోత్తమ శర్మ, వీఆర్ఓ మణీంద్ర, మండల సర్వేయర్ సురేష్, సచివాలయ సర్వేయర్లు, రైతులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు బకాయిలు చెల్లించాలి



కొండపర్వలో ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న నాయకులు

విస్సన్నపేట: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కూలీలకు పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం ఎన్టీఆర్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వి. నాగరాజు, కోట కల్యాణ్ ప్రభుత్వాన్ని కోరారు. విస్సన్నపేట మండలం కొండపర్వలో ఉపాధి కూలీల సమస్యలను వారు అడిగి తెలుసుకున్నారు. ఎన్టీఆర్ జిల్లాలో ఉపాధి కూలీలకు రూ.72 కోట్ల మేర వేతన బకాయిలు చెల్లించాల్సి ఉందని, గత 11 వారాలుగా ఉపాధి వేతనాలు చెల్లించకపోవడంతో కూలీలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. ప్రతి వారం పే స్లిప్పులు ఇవ్వాలని, పని ప్రదేశంలో తాగునీటి వసతి కల్పించాలని కోరారు. సీఐటీయూ నాయకులు పానెం ఆనందరావు, ఆకుల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

దాడి కేసులో నిందితుడి అరెస్ట్

తిరువూరు: క్రికెట్ బెట్టింగ్ వివాదంలో యువకుడిపై దాడి చేసిన నిందితుడిని తిరువూరు పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. ఎస్ఐ సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. తిరువూరు మునుకుళ్ల రోడ్డులో మద్యం మత్తులో కర్రి నరేష్ అనే యువకుడిపై సీసాతో దాడిచేసి తీవ్రంగా గాయపరిచిన గంగా మహేష్‌పై హత్యాయత్నం కేసు నమోదు చేశారు. నిందితుడిని అరెస్టు చేసి తిరువూరు కోర్టులో హాజరుపరచగా మేజిస్ట్రేట్ 14 రోజుల రిమాండ్‌కు ఆదేశించారు.

14న మద్యం షాపులను మూసివేయాలి

చాట్రాయి: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి సందర్భంగా ఈనెల 14న మద్యం అమ్మకాలను నిలిపి వేయాలని సీపీఐ వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి కొమ్ము ఆనందం డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గాంధీ జయంతి, ఆగస్టు 15న మద్యం షాపులను మూసి వేస్తున్నారని, అదే విధంగా అంబేడ్కర్ జయంతి రోజున కూడా మద్యం షాపులను మూసివేయాలని కోరారు. తహసీల్దార్ గీతకు వినతిపత్రం అందజేశారు.

గాలులతో విద్యుత్ శాఖకు రూ.2 లక్షల నష్టం

ఇబ్రహీంపట్నం: మండల పరిధిలో సోమవారం రాత్రి వీచిన ఈదురు గాలులకు మండలంలోని అన్ని గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. రాత్రంగా ఉక్కపోతతో ప్రజలు అల్లాడారు. అర్ధరాత్రి వేళ విద్యుత్ స్తంభాలు, తీగలకు మరమ్మతులు నిర్వహించి మంగళవారం తెల్లవారు జామున మూడు గంటల సమయంలో విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. వివిధ గ్రామాల్లో ఆరు విద్యుత్ స్తంభాలు విరిగిపోయాయని, విద్యుత్ తీగలు తెగిపోయాయని ఏఈ వెంకన్న తెలిపారు. విరిగిన స్తంభాల స్థానంలో యుద్ధప్రాతిపదికన నూతన పోల్స్ ఏర్పాటు చేశామన్నారు. విద్యుత్ శాఖకు సుమారు రూ.2 లక్షల నష్టం వాటిల్లిందని ఏఈ చెప్పారు

కోళ్ల వ్యర్థాల లారీ బోల్తా

విస్సన్నపేట: కోళ్ల వ్యర్థాలు తరలిస్తున్న లారీ మండలంలోని చంద్రుపట్ల వద్ద మంగళవారం బోల్తా కొట్టింది. తెలంగాణ నుంచి విస్సన్నపేట వైపు వెళుతున్న ఈ లారీ అతివేగంతో వెళుతూ అదుపు తప్పి పల్టీ కొట్టింది. రోడ్డు వెంబడి కోళ్ల వ్యర్థాలు చెల్లాచెదురుగా పడటంతో దుర్గంధంతో గ్రామస్తులు, వాహన చోదకులు ఇబ్బందికి గురయ్యారు. మరో లారీలోకి ఈ వ్యర్థాలను లోడింగ్ చేసి తరలించారు. ప్రతి రోజూ కోళ్ల వ్యర్థాలను ఈ రహదారిలో రవాణా చేసే లారీలు రాకపోకలు సాగిస్తుండటంతో దుర్గంధం భరించలేకపోతున్నామని స్థానికులు చెబుతున్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
తిరువూరు డివిజన్
99510 20399 (తిరువూరు),
99122 20544 (నూజివీడు)
90102 23734 (మైలవరం)
Office mail : sakshiads@gmail.com